సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



చిన్నారులకు టీకాలు

పెదబయలు మండలంలో చిన్నారుల్లో మీజిల్స్,రుబెల్లా నివారణకు శుక్రవారం నుంచి టీకాలు వేస్తున్నారు. 8లో



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి నిత్యకల్యాణాన్ని విశేషంగా ఆలయ కల్యాణమండపంలో నిర్వహించారు.



విశాఖలో జీబీ సిండ్రోమ్ అలజడి

'గులియన్ బారే సిండ్రోమ్' ఇంతవరకూ పరిచయమే లేని ఈ పేరు.. ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. 8లో

న్యూస్‌రీల్

రంపచోడవరం ఐటీడీఏ డీడీగా రుక్మాంగదయ్య

రంపచోడవరం: స్థానిక గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా ఎం.రుక్మాంగదయ్యను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పూర్తి బాధ్యతలతో డిప్యూటీ డైరెక్టర్‌గా విజయశాంతి విధులు నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లా ఎస్టీ వెల్ఫేర్ ఎన్‌పవర్‌మెంట్ అధికారిణిగా పనిచేసేవారు. రంపచోడవరం ఐటీడీఏలో రెగ్యులర్ డీడీ పోస్టును భర్తీ చేయడంతో ఆమె తిరిగి పాత పోస్టులో చేరుతారు.

నేటి నుంచి ఏకలవ్య టెన్త్ పరీక్షలు

రాజవొమ్మంగి: ఏకలవ్య మోడల్ పాఠశాలల్లో శనివారం నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నట్టు స్థానిక ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.వి. కృష్ణారావు తెలిపారు. తమ పాఠశాలకు చెంది 30 మంది బాలికలు, 30 మంది బాలురు పరీక్షలకు హాజరతున్నట్టు ఆయన చెప్పారు. ఇందుకోసం ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక అబ్జర్వర్‌ను నియమించినట్టు తెలిపారు. పరీక్షలు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. మొదటి రోజు 15వ తేదీ శనివారం ఇంగ్లిష్ లిటరేచర్/లాంగ్వేజ్, 20వ తేదీ గురువారం సైన్స్, 25న మంగళవారం సోషల్, మార్చి 10న సోమవారం గణితం (స్టాండర్డ్), 12న బుధవారం తెలుగు, 18న మంగళవారం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

శతశాతం హాజరు తప్పనిసరి



టేకులవీధి ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

గంగవరం(అడ్డతీగల): విద్యార్థుల హాజరు వందశాతం తప్పని సరిగా ఉండాలని ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. గంగవరం మండలం టేకులవీధి ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 150 మంది విద్యార్థులకు గాను 138 హాజరవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండాల్సిందేనన్నారు. 13 మంది ఉపాధ్యాయులకు 12 మంది పాఠశాలలో ఉండడంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు.పదవ తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు.


అధిక ధరలకు మద్యం విక్రయంపై ఆగ్రహం



చింతూరులోని మద్యం దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజన యువకులు

చింతూరు: స్థానిక మద్యం దుకాణాల్లో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ శుక్రవారం కొంతమంది గిరిజన యువకులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ దుకాణ యజమానులతో వాగ్వాదానికి దిగారు. దుకాణాల ఎదుట ధరల పట్టిక ఉంచకుండానే ఇష్టమొచ్చిన ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారని యువకులు మండిపడ్డారు. ఎలాంటి అనుమతులు లేకున్నా దుకాణాల వద్ద సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారని, అధిక ధరలపై ప్రశ్నిస్తే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ దురుసుగా మాట్లాడుతున్నారని యువకులు ఆరోపించారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు దృష్టిసారించి అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వాహన చోదకులకు జరిమానా



గంగవరంలో వాహనాల తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

గంగవరం(అడ్డతీగల): నిబంధనలు పాటించని ఏడు వాహనాల చోదకులకు రూ.2,500 జరిమానా విధించినట్టు గంగవరం ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. గంగవరం వై.జంక్షన్‌లో శుక్రవారం విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు నిబంధనలు పాటించాలని, లైసెన్స్‌లు, రికార్డులు కలిగి ఉండాలని సూచించారు. డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.

సంతల్లో త్రాసు పాములు

ముందు దగా, వెనుక దగా..
ఇక్కడా, అక్కడా అన్న తేడా లేకుండా
గిరిజన రైతులు మోసానికి గురవుతున్నారు.
గిట్టుబాటు ధర ఉంటే దిగుబడి ఉండదు. దిగుబడులు
బాగున్నాయనుకుంటే గిట్టుబాటు ధరలు కల్పించడం లేదు.
అన్నీ బాగుంటే వ్యాపారులు తప్పుడు కాటాలతో రైతు
కష్టాన్ని దోచుకుంటారు. అటవీ ఉత్పత్తులు, వ్యవసాయ,
వాణిజ్య పంటల కొనుగోలులో వ్యాపారులు మోసాలకు
పాల్పడుతూ రైతుల కష్టాన్ని కాజేస్తున్నారు.
ముఖ్యంగా జిల్లాలో జరుగుతున్న సంతల్లో
ఇటువంటి మోసాలు అధికంగా
జరుగుతున్నాయి.

- విచ్చలవిడిగా తూకాల్లో మోసాలు
- ఎలక్ట్రానిక్ తూకంలోనూ అదే దగా
- కొత్తగా రిమోట్‌తో మోసాలు
- కిలోకు 100నుంచి 200గ్రాముల తేడా
- భారీగా నష్టపోతున్న గిరిజన రైతులు
- తూనికలు,కొలతల అధికారుల దాడులకు భయపడని వ్యాపారులు



హుకుంపేట సంతలో తూకం కేంద్రం



ఎలక్ట్రానిక్ తూనిక

సాక్షిపాడేరు: ఆరుగాలం కష్టపడి పండించిన వ్యవసాయ,వాణిజ్య పంటలకు సంతల్లో గిట్టుబాటు ధరలు లేకపోగా మరో వైపు తూకంలోను మోసాలు భారీగా జరుగుతుండడంతో గిరిజన రైతులు నష్టపోతున్నారు. ఏ తూకం కేంద్రాన్ని నమ్మాలో...ఆ తూకం కచ్చితమో? కాదో ?.. తెలియక రైతులు ఆవేదన చెందుతున్నారు.వారపుసంతల్లో పాతపద్ధతిలోని తూకం కేంద్రాలతో పాటు ఆధునిక ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలతోను మోసాలు జరుగుతున్నాయి. కిలోకు 100నుంచి 200గ్రాముల వరకు తేడాగా తూచి గిరిజన రైతులను మోసం చేస్తున్నారు. తూనికలు, కొలతలశాఖ అధికారులు సంతల్లో కేసులు నమోదు చేసి, తూనిక యంత్రాలను సీజ్ చేస్తున్నా వ్యాపారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. మూడు నెలల నుంచి ప్రతి సంతలోను కాఫీగింజలు, రాజ్‌మా, పసుపు, పిప్పలమోడి వంటి ఉత్పత్తుల వ్యాపారం రూ.50లక్షల నుంచి రూ.కోటి మధ్య జరుగుతోంది.

వారపుసంతల్లో జరిగే వ్యాపారం

ప్రాంతం	వ్యాపారం (రూ.లక్షల్లో)
అరకు	70
హుకుంపేట	50
కించుమండ	20
నుంకరమెట్ట	40
గుత్తులపుట్టు	40
పెదబయలు	50
ముంచంగిపుట్టు	40
జి.మాడుగుల	50
అన్నవరం	50

50 కిలోల్లో 5 కిలోల తరుగు

పూర్వం నుంచి ఉన్న కర్రల (మూడు కర్రలు నిలబెట్టి ఏర్పాటు చేసే) తూకం కేంద్రాల్లో అధికంగా మోసాలు జరుగుతున్నాయి.50కిలోల బరువు ఉండే ఉత్పత్తులకు కనీసం 5 కిలోల వరకు తరుగు వస్తోంది. బస్తాలు,ఇతర తరుగు పేరిట కూడా కొంత మంది వ్యాపారులు మోసం చేస్తున్నారు. తూకం రాళ్లలో కూడా తేడాలుంటున్నాయని రైతులు వాపోతున్నారు.

40 కేసులు నమోదు

ఈ రెండు నెలల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా తప్పుడు తూకాలకు పాల్పడిన 40 మంది వ్యాపారులపై కేసులు నమోదయ్యాయి.జరిమానాలు కూడా విధించారు. తూకం యంత్రాలను సీజ్ చేశారు. తూనికలు,కొలతలశాఖ అధికారుల దాడులు,కేసులకు వ్యాపారులు ఏ మాత్రం భయపడడం లేదు. క్రిమినల్ కేసులు కాకపోవడంతో ఎటువంటి బెదురు లేకుండా మరో తూకం యంత్రాన్ని కొనుగోలు చేసి, యథావిధిగా తమ కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు. జరిమానా విధించినా క్షణాల్లో చెల్లిస్తున్నారు.

ఎలక్ట్రానిక్ యంత్రాలతో మరింత మోసం



అరకు సంతలో 10 కిలోల గుండు బరువును ఎలక్ట్రానిక్ తూకం యంత్రంపై 8.96 కిలోలు చూపుతున్న దృశ్యం

ఎలక్ట్రానిక్ తూకం యంత్రాల వినియోగం అధికమైంది.చిన్న వ్యాపారి నుంచి పెద్ద వ్యాపారి వరకు సంతల్లో ఈ యంత్రాలను వినియోగిస్తున్నప్పటికీ వారిలో కొంతమంది తూకంలో తేడాలతో రైతులను మోసం చేస్తున్నారు. కిలోకు 100 గ్రాముల వరకు తూకంలో తేడా జరుగుతోంది. అటవీ ఉత్పత్తులు కొనే సమయంలోనే 100 నుంచి 200 గ్రాముల వరకు మోసం చేస్తున్నారు. 10 కిలోల తూకం రాయి ఈయంత్రాలపై పెడితే 850 నుంచి 900 గ్రాముల మాత్రమే బరువు తూగుతోంది. ప్రతి 10 కిలోల వ్యవసాయ ఉత్పత్తులకు సుమారు 2 కిలోల వరకు బరువులో మోసం జరుగుతుండడంతో గిరిజన రైతులకు నష్టం అధికంగా నష్టపోతున్నారు.

రిమోట్‌తో మోసాలు



ఎలక్ట్రానిక్ తూకం యంత్రానికి అడుగున అమర్చిన రిమోట్ పరికరం



ఎలక్ట్రానిక్ కాటాకు అమర్చిన రిమోట్

ఇటీవల కొంతమంది వ్యాపారులు సాంకేతిక పరిజ్ఞానంతో మోసాలు చేస్తున్నారు.తూకం యంత్రాలకు రిమోట్‌ను సెట్ చేసి వ్యవసాయ ఉత్పత్తుల బరువు తూచే సమయంలో మోసాలకు పాల్పడుతున్నారు. ఈ రిమోట్‌లను అరకు,హుకుంపేట సంతల్లో తూనికలు, కొలతలుశాఖ అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఈ తూకం యంత్రాలను స్వాధీనం చేసుకున్నప్పటికీ అలాంటివి చాలా అనేకమంది వినియోగిస్తున్నట్టు సమాచారం.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



ఎంతో కష్టపడి సాగు చేసిన వ్యవసాయ,వాణిజ్య పంటలను అమ్ముకునే సమయంలో తూకంలో మోసాలతో భారీగా నష్టపోతున్నాం.సంతల్లో వ్యా పారుల తూనిక కేంద్రాలను నమ్మలేకపోతున్నాం. 50 కిలోల సరుకు అమ్ముకుంటే ఐదు కిలోల తూకం తగ్గితే ఎంత నష్టమో అధికారులు ఆలోచించాలి.మోసాలు చేసే వ్యాపారులపై క్రిమినల్ కేసులు పెడితే మార్పు వస్తుంది.

– దుంబేరి అప్పలస్వామి, గిరిజన రైతు, రాళ్ల మత్స్యపురం, హుకుంపేట మండలం

ప్రభుత్వమే తూకం కేంద్రాలు నిర్వహించాలి



అన్ని వారపు సంతల్లోను తూనికల్లో మోసాలు అధికంగా ఉండడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వమే ఐటీడీఏ,మార్కెటింగ్‌శాఖల ద్వారా తూనిక కేంద్రాలను నిర్వహించి రైతులకు న్యాయం చేయాలి

– చెట్టి రంగయ్య, గిరిజన రైతు, సీకరి గ్రామం, పెదబయలు మండలం

సంతల్లో తనిఖీలు విస్తృతం

ప్రస్తుతం గిరిజన ఉత్పత్తుల వ్యాపార సీజన్ కావడంతో అన్ని వారపుసంతల్లోను తూకం కేంద్రాల తనిఖీలను విస్తృతం చేస్తున్నాం.ఈ రెండు నెలల్లో తప్పుడు తూకాలను గుర్తించి 40కేసులు నమోదు చేశాం. కేసులు నమోదు చేస్తున్న వ్యాపారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఎక్కువసార్లు కేసులు నమోదైన వ్యాపారులపై కఠిన చర్యలకు గాను తమశాఖ ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– అనురాధ, ఇన్‌స్పెక్టర్, తూనికల కొలతలుశాఖ

నో స్లిప్స్.. పేపర్ లీకేజ్ మాస్ కాపీయింగ్

- పకడ్బందీగా టెన్త్,ఇంటర్ పరీక్షలు
- కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్


సాక్షి,పాడేరు: విద్యార్థులంతా కష్టపడి చదివి మంచి మార్కులతో టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని, ఇతర తప్పుడు మార్గాలను అన్వేషించవద్దని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించి పలుశాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నో మాస్‌కాపీయింగ్,నో స్లిప్స్,నో పేపర్ లికేజ్ అనే విధంగా పరీక్షలు జరపాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు,సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. 144వసెక్షన్ అమలుజేయడంతో పాటు పరీక్షల సమయంలో ఇంటర్నెట్, జెరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు.పరీక్ష కేంద్రాలకు విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు,ఇతర సిబ్బంది ఎలక్ట్రానిక్ సామగ్రి తీసుకువెళ్లరాదని తెలిపారు. సెల్‌ఫోన్లు,బ్లూటూత్ పరికరాలు,ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తనిఖీల సమయంలోనే డిపాజిట్ చేయాలన్నారు. జిల్లాలో 258 పాఠశాలలకు చెందిన 11,766 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారని, అలాగే ఓపెన్ స్కూల్‌కు సంబంధించి టెన్త్‌లో 1,297మంది పరీక్షలు రాస్తారన్నారు. వీరందరికీ ఒకేసారి మార్చి 17నుంచి 31వతేదీ వరకు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.71పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.ఇంటర్మీడియెట్‌కు సంబంధించి మొదటి సంవత్సరం విద్యార్థులు 6,518 మంది,ఒకేషనల్ విద్యార్థులు 1,545 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,335 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,322 మంది పరీక్షలకు హాజరవుతారని ఆయన తెలిపారు. ఓపెన్ ఇంటర్‌లో పరీక్షలను 1,699 మంది రాయనున్నట్టు చెప్పారు. ఇంటర్ పరీక్షలు మార్చి 1నుంచి 20వతేదీ వరకు,ఓపెన్ ఇంటర్ పరీక్షలు మార్చి 3నుంచి 15వతేదీ వరకు జరుగుతాయన్నారు.అన్ని పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. డీఈవో, ఇంటర్ విభాగం కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు.ఇటీవల బంద్ కారణంగా రద్దు అయిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షను ఈనెల 20న నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో పద్మలత,జిల్లా ఇంటర్ విభాగం అధికారి అప్పలరాము,పరీక్షల విభాగం సహాయ కమిషనర్ శశికుమార్,ఇన్‌చార్జి డీడీ రజని, డీఎల్‌పీవో కుమార్,విద్యుత్ పంపిణీ సంస్థ ఈఈ అప్పారావు,ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరావు,పాడేరు సీఐ దీనబందు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీ

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 34 కేటగిరీలకు సంబంధించి 244 అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వైద్య పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేస్తామని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టులు అమ్ముకుంటున్నారనే వదంతులు తన దృష్టికి వచ్చాయని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వీటిని నమ్మవద్దని, డబ్బులు ఇచ్చి మోసపోవద్దని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నోటిపై చేసిన పోస్టుల ఖాళీలను రోస్టర్ అనుసరించి మాత్రమే భర్తీ చేస్తామని తెలిపారు. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన, ఉద్యోగ నియామకాలకు నోడల్ అధికారి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థుల విద్యార్హత, మార్కుజాబితా, అనుభవం, ఇతర అంశాల ఆధారంగానే మెరిట్ లిస్ట్ ప్రకటిస్తామని తెలిపారు. మెరిట్ లిస్ట్ ప్రకారమే తుదిజాబిత ప్రకటించి, ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఎవరైనా డబ్బులు అడిగినట్టు తెలిస్తే కళాశాల ప్రిన్సిపాల్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ఆదర్శనీయుడు దామోదరం సంజీవయ్య



సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు

సాక్షి,పాడేరు: నిజాయితీతో ఎదిగిన దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆదర్శనీయులని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత పేద కుటుంబానికి చెందిన సంజీవయ్య స్వయంకృషితో ఎంతో ఎత్తుకు ఎదిగి, 38 ఏళ్ల అతి చిన్న వయసులోనే ముఖ్యమంత్రి పదవిని అలంకరించారన్నారు. 2008లో విశాఖపట్నంలో స్థాపితమైన ఏపీ న్యాయ విశ్వవిద్యాలయానికి దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయంగా 2012లో పేరు మార్చారని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌వో పద్మలత, సాంఘిక సంక్షేమశాఖాధికారి జనార్దనరావు, డీఈవో పి.బ్రహ్మాజీరావు, వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు నందు, రమేష్‌కుమార్‌రావు, డీపీఆర్‌వో గోవిందరాజులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



పాఠశాలలో సౌకర్యాల గురించి విద్యార్థిని అడిగి తెలుసుకుంటున్న పీవో సింహాచలం

మారేడుమిల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యతో పాటు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పరిశుభ్రత ఏవిధంగా ఉంది, మెనూ ప్రకారం ఆహారం పెడుతున్నారా, లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి రోజు వేడివేడిగా ఆహార పదార్థాలు వండి అందజేయాలని, వాటిని ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

అర్హులైన నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేస్తాం

పోలవరం ప్రాజెక్టు పరిపాలన అధికారి అభిషేక్



అధికారులతో మాట్లాడుతున్న పోలవరం పరిపాలన అధికారి అభిషేక్ , సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: అర్హులైన పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేస్తామని పోలవరం ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ పరిపాలన అధికారి వి.అభిషేక్ తెలిపారు. రంపచోడవరం పీఎంఆర్‌సీ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుపై సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, ఇతర అధికారులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అనేక గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేసినట్టు చెప్పారు. రంపచోడవరం డివిజన్‌లో రెండు, చింతూరు డివిజన్‌లో నాలుగు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నేలదొనెలపాడులోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉన్న కొండమొదలు నిర్వాసితులకు భూమికి భూమి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. గోకవరంలో కొంత మంది గిరిజనేతరులకు ఇళ్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ నిర్మాణాలను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం దేవీపట్నం మండలం ముసినికుంట ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సందర్శించి నిర్వాసితుల సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అర్హులైన ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ అంబేడ్కర్, తహసీల్దార్ కరక సత్యనారాయణ, డీటీ త్రిమూర్తులు, దాసు తదితరులు పాల్గొన్నారు.

అరకు సంతలో విస్తృత తనిఖీలు



సంతలో తూనిక గుండును తనిఖీ చేస్తున్న అధికారులు



కాటాలను పరిశీలిస్తున్న తూనికల శాఖ జాయింట్ కంట్రోలర్ రాజేష్‌కుమార్

10 మంది వ్యాపారులపై కేసులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతలో శుక్రవారం తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ రాజేష్‌కుమార్ పర్యవేక్షణలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తూనికల్లో మోసాలకు పాల్పడుతున్న 10 మందిపై కేసులు నమోదు చేశారు. సంతలో ధర్మకాటా పెట్టి వినియోగదారులు కొనుగోలు చేసిన నిత్యావసర వస్తువుల తూకం పరిశీలించారు. అనంతరం తూనికలు,కొలతల్లో మోసాలపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ కంట్రోలర్లు రాధాకృష్ణ, చిన్నమ్మలు, ఇన్‌స్పెక్టర్ ఉమాసుందరి పాల్గొన్నారు.

మర్రివాడ వీఆర్‌పీపై విచారణ

కొయ్యూరు: ఉపాధి హామీ పథకం పనులకు హాజరుకాకుండానే వేతనదారులకు మస్తర్లు వేస్తున్నారని ఆరోపణలు రావడంతో మర్రివాడ వీఆర్‌పీ జుర్రా సత్యనారాయణపై శుక్రవారం దొడ్డవరంలో ఎంపీడీవో ప్రసాద్, ఏపీవో అప్పలరాజు విచారణ నిర్వహించారు. మస్తర్లు వేయడంలో వీఆర్‌పీ అవినీతికి పాల్పడుతున్నారని సర్పంచ్ మాదల సత్యవతి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు.దీంతో సర్పంచ్‌తో పాటు గ్రామస్తులను విచారించి, వివరాలు సేకరించారు. అయితే వీఆర్‌పీ హాజరుకాకపోవడంతో మరో రోజు విచారణ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

క్లుప్తంగా

దేశ రక్షణలో పరిశోధనా సహకారం అందించండి

- ఏయూని కోరిన తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా



వర్సిటీ అధికారులతో సమావేశమైన సమీర్ సక్సేనా

విశాఖ విద్య: దేశ రక్షణలో ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లను అధిగమించే దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధన సహకారం అందించాలని తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా అన్నారు. శుక్రవారం ఆయన తన బృందంతో వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి. శశిభూషణరావుతో సమావేశమయ్యారు. రక్షణ రంగానికి అవసరమైన వివిధ పరిశోధన సంబంధిత అవసరాలపై చర్చించారు. శత్రుదేశాల నుంచి తమకు ఎదురవుతున్న సమస్యలను అధిగమించడానికి, పరిష్కరించడానికి అవసరమైన శాస్త్రీయ అధ్యయనాలు జరిపి సూచనలు అందించాలని ఏయూను కోరారు. ఏయూ ముందుకు వస్తే తాము దీనికి అవసరమైన ప్రాజెక్టులను మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, పలువురు ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాస్తు యజ్ఞం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శుక్రవారం శ్రీరాధాకృష్ణ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 5.30 గంటలకు వాస్తుయజ్ఞం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రధాన పూజారి గుణభద్ర దాస, బెంగళూరుకు చెందిన ఇస్కాన్ ఉపాధ్యక్షుడు కులశేఖర దాస, శ్రీవాస దాస, విశాఖ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస వాస్తు హోమం ప్రాధాన్యం గురించి వివరించారు. మూడు రకాల దోషాలను నివారించడానికి గృహ ప్రవేశ సమయంలో ఈ హోమం నిర్వహిస్తారని, ఐశ్వర్యం, ఆరోగ్యం, శాంతి చేకూరుతాయన్నారు.



విశాఖలో జీబీ సిండ్రోమ్ అలజడి

- ఆరు కేసుల నమోదు
- కేజీహెచ్‌లో ఐదుగురు, ప్రైవేట్ ఆస్పత్రిలో ఒకరు చికిత్స
- అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడి
- అప్రమత్తమైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

'గులియన్ బారే సిండ్రోమ్' ఇంతవరకూ పరిచయమే లేని ఈ పేరు.. ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. విశాఖలో వణుకు పుట్టిస్తోంది. నగరంలో ఇప్పటికే ఆరు కేసులు నమోదయ్యాయి. దీంతో వైద్య శాఖ అప్రమత్తమైంది. అసలేంటి ఈ గులియన్ బారే సిండ్రోమ్? కరోనాలా ఇది కూడా అంటు వ్యాధా..? వైద్యులు ఏమంటున్నారు..? తెలుసుకుందాం.

-మహారాణిపేట (విశాఖ)

ఈ వైరస్ పేరు గులియన్ బారే సిండ్రోమ్. దీని బారినపడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం, డయేరియా, పొత్తి కడుపు నొప్పి, జ్వరం, వాంతులు కావడం లాంటి లక్షణాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ బ్యాక్టీరియా సోకుతుంది. ఈ వ్యాధి ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపైనే తీవ్ర ప్రభావం చూపుతుంది. నాడీ వ్యవస్థను ఈ వైరస్ దెబ్బతీస్తుంది. దీంతో రోగి పక్షవాతం బారిన పడతాడు. అయితే సకాలంలో వైద్యం అందితే ముప్పు ఉండదు. వ్యాధి సోకిన తొలి దశలోనే ఆస్పత్రిలో చేరితే.. 4 వారాల్లో కోలుకునే చాన్స్ ఉంటుంది. వ్యాధి ముదిరితే కోలుకోవడానికి దాదాపు 6 నెలలు పట్టొచ్చు. అత్యధిక శాతం మందిలో ఇన్‌ఫెక్షన్ మొదలైన ఒకటి రెండు వారాల తర్వాతే ఇది బయటపడుతుంది.

గులియన్ బారే సిండ్రోమ్ బాధితుల్లో ఐదుగురు కేజీహెచ్‌లోను, ఒకరు కలెక్టరేట్‌కు సమీపంలోని ఆయుష్మాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. జీబీ సిండ్రోమ్ బారిన పడిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విషయంపై వైద్యాధికారులు దృష్టి పెట్టారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా రోగులు కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉండడంతో ఈ రోగులకు మెరుగైన చికిత్స అందించడానికి అధికారులు ప్రత్యేకంగా వైద్యులను నియమించారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో చేరిన ఐదుగురు రోగులకు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్ వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం స్థిరంగానే ఉన్నట్లు డాక్టర్ రాధాకృష్ణ తెలిపారు. ఆయూష్మాన్ ఆస్పత్రిలో ఓ రోగి కోలుకుంటున్నాడని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు చెప్పారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాధి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

జీబీఎస్ అంటే ఏమిటి..?

జీబీఎస్ అంటే గులియన్ బారే సిండ్రోమ్. ఈ గులియన్ బారే సిండ్రోమ్ అనేది ఒక రకమైన ఆటో ఇమ్యూన్ (ఒక వ్యక్తిలోని రోగనిరోధక వ్యవస్థ తనలోని ఆరోగ్య కణాలనే శత్రువులుగా భావించి దాడి చేయడం) సిండ్రోమ్. ఈ సిండ్రోమ్ బారినపడిన వ్యక్తిలో ఉన్న రోగ నిరోధక వ్యవస్థ అతని నాడీ వ్యవస్థపైనే దాడి చేస్తుంది. అందుకే దీన్ని ఆటో ఇమ్యూన్ సిండ్రోమ్ అని అంటారు. ఈ సిండ్రోమ్‌వల్ల బాధితుడిలోని నరాలు, కండరాలు బలహీనంగా మారుతాయి. వివిధ రకాల వైరల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు సోకిన వారు.. అలాంటి సమయంలో ఈ గులియన్ బారే సిండ్రోమ్ బారిన పడే ప్రమాదం కూడా ఉంది.

పిల్లలు అప్రమత్తంగా ఉండాలి

ఈ వ్యాధి చిన్నపిల్లలకు త్వరగా సోకుతుంది. చాలా పురాతనమైన వ్యాధుల్లో ఇది ఒకటి అని కేజీహెచ్ పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. ప్రస్తుతం పిల్లలకు ఎవరికీ ఈ వ్యాధి సోకలేదని తెలిపారు. ఒక వేళ జీబీఎస్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

అవహేళనగా మాట్లాడి.. కత్తి పోట్లకు గురై..

- మందుబాబుల గొడవలో ఒకరు హత్య
- ఇద్దరూ ఆటోడ్రైవర్లే..

మల్కాపురం: అవహేళనగా మాట్లాడినందుకు ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురై చికిత్స పొందుతూ మరణించాడు. ఈ విషాద సంఘటన మల్కాపురంలో చోటు చేసుకుంది. సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలివి.. మల్కాపురం పల్లివీధి ప్రాంతానికి చెందిన నీలాపు శ్యామ్ అలియాస్ శామ్యూల్(32) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గతంలో అతను హెచ్‌పీసీఎల్‌లో సొసైటీ కార్మికుడిగా పనిచేశాడు. మద్యం అలవాటు ఉన్న శ్యామ్ సొసైటీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ ఆటో డ్రైవర్‌గా మారాడు. 2020లో వివాహం జరగ్గా.. భార్యతో సఖ్యత లేకపోవడంతో ప్రస్తుతం ఆమె శ్యామ్‌కు దూరంగా ఉంటోంది. కాగా.. గురువారం రాత్రి శ్యామ్ మద్యం సేవించి మల్కాపురం ఆటో స్టాండ్ వద్ద ఉన్నాడు. అదే సమయంలో 60వ వార్డు ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీకి చెందిన సీహెచ్ అప్పన్న రెడ్డి కూడా అక్కడ మద్యం తాగుతూ ఉన్నాడు. వృత్తిరీత్యా ఆటో డ్రైవర్ అయిన అప్పన్న రెడ్డి నుంచి కూడా భార్య దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో శ్యామ్..అప్పన్న రెడ్డిని 'నువ్వు చేతకాని వాడివి.. అందుకే నీ భార్య నిన్ను వదిలి వెళ్లింది' అని అవహేళనగా మాట్లాడాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి, అది తోపులాటకు దారి తీసింది. తోపులాటలో శ్యామ్ చేష్టలతో అప్పన్న మరింత ఆగ్రహానికి గురయ్యాడు. మద్యం మత్తులో ఉన్న శ్యామ్ ఆటోలో నిద్రిస్తున్న సమయంలో.. అప్పన్న తన వెంట తెచ్చుకున్న కత్తితో అతనిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన శ్యామ్‌ను స్థానికులు వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం ఇంటికి వెళ్లిన శ్యామ్‌కు శుక్రవారం ఉదయం కత్తిపోట్లు తగిలిన చోట రక్తస్రావం అయింది. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటల సమయంలో శ్యామ్ మృతి చెందినట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు. ఈ కేసులో నిందితుడైన అప్పన్నను అదుపులోకి తీసుకుని, విచారించి రిమాండ్‌కు తరలించారు.

దేవీపురంలో ఎంఎం కీరవాణి



అమ్మవారిని దర్శించుకుంటున్న కీరవాణి

సబ్బవరం:ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి అమ్మవారిని ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి శుక్రవారం దర్శించుకున్నారు. దేవీపురంలోని దత్త గురు పీఠం, కామాఖ్య శక్తి పీఠం, శ్రీయంత్ర మహామేరులోని కంచి కామాక్షి, మధుర మీనాక్షి, కాశీ విశాలాక్షి అమ్మవార్ల ప్రతి రూపాలను ఆయన సోదరుడు కాంచితో కలిసి దర్శించుకున్నారు. అనంతరం వారాహి సహిత చండీ హోమంలో పాల్గొన్నారు. ట్రస్టు నిర్వహిస్తున్న అమృత కన్యా గురుకుల విద్యార్థులతో సంభాషించి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. గురుపుత్రికలు రాధ, కందర్ప రమ యూఎస్ఏకు చెందిన ప్రముఖ రచయిత మిచల్ బైడెన్ రచించిన గాడెస్ అండ్ ద గురు గ్రంథాన్ని కీరవాణికి అందజేశారు.

నాటు సారా బట్టీలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

- 20 లీటర్ల నాటు సారా స్వాధీనం
- ఇద్దరు వ్యక్తుల అరెస్టు
- అక్రమంగా నిల్వ ఉంచిన 212 బెల్లం దిమ్మలు సీజ్



నాటుసారాతో పట్టుబడిన వ్యక్తులతో చోడవరం ఎక్సైజ్ సీఐ పాపునాయుడు తదితరులు

దేవరాపల్లి: దేవరాపల్లి ఒడ్డు చింతల కల్లాలు సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న నాటు సారా బట్టీపై చోడవరం ఎక్సైజ్ సీఐ కె.వి.పాపునాయుడు ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది శుక్రవారం మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో 20 లీటర్ల నాటు సారాతో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. సారా తయారీకి వినియోగించే బెల్లం కొనుగోలుపై వారిద్దరూ ఇచ్చిన సమాచారంతో బెల్లం దిమ్మలు నిల్వ చేసిన గిడ్డంగిపై సైతం దాడులు నిర్వహించారు. సదరు గిడ్డంగిలో అక్రమంగా నిల్వ చేసిన 3180 కేజీలు బరువు కలిగిన (212 బెల్లం దిమ్మలు) బెల్లం దిమ్మలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని సీఐ పాపునాయుడు తెలిపారు. ఈ దాడుల్లో నాటు సారాతో పట్టుబడిన దేవరాపల్లికి చెందిన వరదపురెడ్డి నాయుడు, పైలా నాగరాజుతో పాటు బెల్లం విక్రయిస్తున్న గుప్తాజీని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా గురు చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. తమ పరిధిలో 28 గ్రామాల్లో నాటు సారా విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లో బెల్లం విక్రయదారులని గుర్తించి ముందుగా నోటీసులు ఇచ్చామన్నారు. సారా రహిత గ్రామాలుగా ప్రతి గ్రామాన్ని తీర్చిదిద్దడమే నవోదయం-2 లక్ష్యమని, దీనికి ప్రజలంతా సహకరించాలని సీఐ పాపునాయుడు కోరారు. నాటు సారా బట్టీలపై నిర్వహించిన దాడుల్లో హెచ్‌సీ అప్పారావు, రాంబాబు, రామునాయుడు, కె.ఎస్. అప్పలనాయుడు, స్థానిక మహిళా సంరక్షణ కార్యదర్శి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కిక్కు దిగింది..

మందుబాబులకు కూటమి సర్కార్ షాక్

- మద్యంపై 15 శాతం ధరల పెంపు
- జిల్లాలో మద్యం ప్రియులపై నెలకు రూ.13.5 కోట్ల అదనపు భారం
- అధికారంలోకి వస్తే తక్కువ ధరకే మద్యం ఇస్తామని ప్రగల్భాలు
- మాట తప్పిన కూటమి నేతలపై మండిపడుతున్న మందుబాబులు



సాక్షి, అనకాపల్లి: మందుబాబులకు కూటమి ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. అధికారంలోకి వస్తే తక్కువ ధరకే మద్యం ఇస్తామని ఇచ్చిన హామీని పట్టుమని మూడు నెలలు) కూడా అమలు చేసిన పాపాన పోలేదు. ఏ బ్రాండ్లు అయితే ఎక్కువగా తాగుతున్నారో.. వాటిపైనే 15 శాతం రేట్లు పెంచి మందుబాబుల జేబులకు చిల్లు పెట్టింది. బీర్లు, రూ.99 ధర గల మందు మినహా అన్ని రకాల బ్రాండ్ల రేట్లు పెరిగాయి. కూటమి ప్రభుత్వం వస్తే మద్యం రేట్లు తగ్గుతాయని ఆశ పడిన వారికి భంగపాటు ఎదురైంది. మద్యం ధరలు తగ్గించినట్టే తగ్గించి మూడు నెలల్లోనే పెంచేశారు. ఒక్కో బాటిల్‌పై రూ.10 నుంచి రూ.12 వరకు ధర పెరుగుతోంది. దీంతో జిల్లాలో మందు బాబులపై నెలకు రూ.13.5 కోట్ల అదనపు భారం పడనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఎక్సైజ్ శాఖకు సంబంధించి 8 సర్కిల్స్ పరిధిలో 146 మద్యం దుకాణాలు, 10 బార్లు ఉన్నాయి. సాధారణ రోజుల్లో నెలకు సగటున రూ.90 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రోజుకు రూ.3 కోట్ల మేర జరిగే అమ్మకాలు జాతరలు, పండుగల సమయంలో (రూ.5 కోట్ల వరకు) పెరుగుతాయని అధికారులు వెల్లడిస్తున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, చోడవరం, పాయకరావుపేట, గొలుగొండ సర్కిల్ పరిధిలో మద్యం ఎక్కువగా సేల్ అవుతుంది.

ధరలు పెరిగిన బ్రాండ్లలో కొన్ని..

బ్రాండ్	పాత ధర (రూ.)	కొత్త ధర (రూ.)
ఇండియన్ గ్రైన్ విస్కీ	150	160
8 పీఎం ప్రీమియం రిజర్వ్ విస్కీ	220	240
ఏసీ బ్లాక్ క్లాసిక్ విస్కీ	150	160
డార్క్ బ్లూ డీలక్స్ విస్కీ	180	190
ఆఫ్టర్ డార్క్ బ్లూ డీలక్స్ విస్కీ	180	190
అర్రిస్టోకాట్ ప్రీమియం విస్కీ	180	190
డైరెక్టర్స్ స్పెషల్ గోల్డ్ విస్కీ	130	140
హేవార్డ్స్ ఫైన్ విస్కీ	130	140
మూమెంట్స్ వోడ్కా	230	240
వైట్ హాల్ రేర్ ప్రీమియం బ్రాందీ	150	160
మేజిక్ మంజీర బ్లూ విస్కీ	130	140
మార్ఫ్యూస్ బ్రాందీ	290	300
ఆఫీసర్స్ ఛాయిస్	150	160
ఓల్డ్ మంక్ రమ్	220	230
రాయల్ ఛాలెంజ్ విస్కీ	210	220
ఇంపీరియల్ బ్లూ విస్కీ	360	370
రాయల్ స్టాగ్	230	240
మాన్షన్ హౌస్ ఫ్రెంచ్ బ్రాండ్	100	110
మాన్షన్ హౌస్ స్పిరిట్ ఫ్రెంచ్ బ్రాండ్	190	200

దుకాణాలు పెరిగాయి.. సేల్స్ తగ్గాయి

రాష్ట్రంలో ఇండియన్ మేడ్, ఫారిన్ లిక్కర్, బీర్లు... ఇలా మూడు కేటగిరీల్లో మద్యం సరఫరా చేస్తున్నారు. ప్రైవేట్ మద్యం పాలసీ విధానం తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం లాటరీ విధానంలో టెండర్ ప్రక్రియ చేపట్టి మద్యం దుకాణాలను కేటాయించింది. అమ్మకాలపై దుకాణదారులకు 20 శాతం మార్జిన్ ఇస్తామని చెప్పి.. 14 శాతం మార్జినే చేస్తున్నారు. దీంతో దుకాణదారులు అసంతృప్తిగా ఉన్నారు. దుకాణాల సంఖ్య పెరగడంతో సగటున సేల్స్ తగ్గాయంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో మద్యం ధరలు పెంచడంతో సేల్స్ మరింత తగ్గుతాయంటూ వ్యాపారులు వాపోతున్నారు.

సమస్యల పరిష్కారానికి నోచుకోని
సమావేశాలు ఎందుకు?



సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

- మీటింగ్‌కు గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు
- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న సభ్యులు

పాడేరు రూరల్: ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోని సమావేశాలు ఎందుకని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ సోనారి రత్నకుమారి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీసారి నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే సమావేశాలు ఎందుకు నిర్వహించాలని అధికారులను ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ఉండే సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల మండల స్థాయి అధికారులు గైర్హాజరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సమావేశానికి రాకపోతే ప్రజా సమస్యలు ఎవరికీ తెలియజేయాలన్నారు. గతంలో జరిగిన సమావేశంలో తీర్మాణం చేసిన పనులకు అడిగే నాథుడే లేదన్నారు, ప్రతీసారి సమావేశాలకు మండల స్థాయి అధికారులు హాజరు కావల్సి ఉన్నా, కిందిస్థాయి సిబ్బందికి మొక్కుబడిగా పంపిస్తున్నారన్నారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు స్పష్టం చేశారు.

సమస్యలపై అధికారులను సభ్యులు నిలదీత

మండలంలో వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో నెలకొన్న ప్రధాన సమస్యలపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు సమావేశంలో అధికారులను నిలదీశారు, ప్రతి సమావేశాల్లో చేసే తీర్మాణాలు, ఇచ్చిన వినతులపై స్పష్టమైన సమధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు, సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులే కనీస బాధ్యత వహించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల తీరు మార్చుకోకపోతే సమావేశాలకు బహిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో డేవిడ్, సీడీపీవో ఝాన్సీ రాణి, ఎంఈవో విశ్వప్రసాద్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలంలో పాకల తొలగింపు

హెచ్చరికలు లేకుండా కూల్చారంటున్న బాధితులు



కూల్చివేసిన పాకలు, రేకుల ఇండ్లు

ఎటపాక: మండల కేంద్రంలోని మేడువాయి వద్ద పట్టా భూములను ఆక్రమించి నిర్మించిన పాకలను శుక్రవారం తెల్లవారు జామున అధికారులు కూల్చివేశారు. భద్రాచలం పట్టణానికి చెందిన యమజాల మధుసూధనరావుకు చెందిన సర్వే నంబర్ 86.1,లోగల 2.25 ఎకరాల భూమిని నాలుగేళ్ల క్రితమే ఆక్రమించి 48 కుటుంబాలు పాకలు, రేకుల షెడ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారన్నారు. అయితే తమ భూమి ఆక్రమించి నిర్మాణాలు చేశారని అట్టి భూమి నుంచి నివాస కుటుంబాలను తొలగించి తన భూమి స్వాధీనం చేయాలని హక్కుదారు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు గుడిసెలను తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. నాలుగు మండలాలకు చెందిన రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రత్యేక పోలీసు బలగాలతో తెల్లవారు జామున మేడువాయి చేరుకున్నారు. మూడు జేసీబీలతో ఇండ్లను తొలగించారు. నాలుగు సంవత్సరాలుగా ఇక్కడ నివాసం ఉంటున్న తమకు ఎటువంటి నోటీసులు,హెచ్చరికలు ఇవ్వకుండా గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఇండ్లు కూల్చారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

మీజిల్స్, రుబెల్లా నివారణకు టీకాలు



పెదబయలులో ఐదేళ్లలోపు వయస్సు కలిగిన పిల్లలకు వ్యాక్సిన్ అందిస్తున్న వైద్య సిబ్బంది

పెదబయలు: మండలంలోని 23 గ్రామ పంచాయతీలల్లోని మూడు పీహెచ్‌సీల పరిధిలో ఐదేళ్లలోపు వయస్సు కలిగిన చిన్నారుల్లో మీజిల్స్,రుబెల్లా నివారణకు శుక్రవారం నుంచి టీకాలు వేస్తున్నారు. గత నెలలో పెదబయలు మండలం రూడకోట పీహెచ్‌సీ గిన్నెలకోట పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల్లో చర్మవ్యాధులు ప్రబలాయి. దీంతో సుమారు 40 మంది పిల్లలకు పాడేరు జిల్లా ఆస్పత్రి, కేజీహెచ్‌లో చికిత్స అందించారు. ఈ నేపథ్యంలో పెదబయలు, గోమంగి, రూడకోట పీహెచ్‌సీల పరిధిలో మీజిల్స్,రుబెల్లా అదనపు డోస్ టీకాల కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. పెదబయలు పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపు పిల్లలు 4,870 మంది, గోమంగి పరిధిలో 4,300, రూడకోట పరిధిలో 2,500మందికి మొత్తం 11,670 మందికి టీకాలు వేయనున్నారు. వారం రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంతో ప్రారంభించారు. గ్రామ సచివాలయం పరిధిలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ అసిస్టెంట్, ఆశ కార్యకర్తలు టీకాల కార్యక్రమం చేపట్టినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారులు నిఖిల్, చైతన్య తెలిపారు.

పీఈటీ అసభ్య ప్రవర్తనపై ఫిర్యాదు

గొలుగొండ: చోద్యం జెడ్పీ హైస్కూల్లో పార్ట్ టైమ్ పీఈటీగా పనిచేస్తున్న కుందూరి నూకరాజు విద్యార్థుల పట్ల దురుసుగా, అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలపై ఎంఈవో-1 సత్యనారాయణ శుక్రవారం విచారణ నిర్వహించారు. ఈనెల 1న తమిళనాడు రాష్ట్రంలో జరిగిన లంగిడీ క్రీడలకు చోద్యం హైస్కూల్ నుంచి సుమారు 10 విద్యార్థులు వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో బాలికల పట్ల పీఈటీ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు శుక్రవారం స్కూల్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా ఎంఈవో-1 సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన హైస్కూల్లో విచారణ జరిపి హెచ్ఎం శ్రీనివాస్, తల్లిదండ్రులు, విద్యార్థులతో మాట్లాడి ఏం జరిగిందో తెలుసుకున్నారు. అనంతరం సాక్షితో మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో శుక్రవారం మధ్యాహ్నం వచ్చిన వార్త ఆధారంగా చోద్యం స్కూల్‌కి వచ్చి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను విచారించామన్నారు. పీఈటీ నూకరాజు విద్యార్థుల పట్ల దురుసుగా, అసభ్యంగా ప్రవర్తించినట్లు తేలిందన్నారు. డీఈవోకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.